

# రెండు రెళ్ళు సున్న

—కేయస్వీ

స్థలం: క్లబ్, సమయం: రాత్రి

మాటవరసకి మాట్లాడుకుంటూండగా, ఎవరేమన్నా రెండు రెళ్ళు నాలుగు కాకపోతుందా? అన్నాడొక మిత్రుడు.

—అయితేనేం? కాకపోతేనేం?, అన్నాడు సదాశివం.

—అదేమిటి అలాఅంటావు? రెండు రెళ్ళు నాలుగు కావల్సిందే కదా? అన్నాడు మరో మిత్రుడు.



రచయిత చిరునామా: [redacted]

—కావచ్చును, కాకపోవచ్చును. దానివల్ల ఫలిత మేమిటి అంటాను, అని రెట్టించి సిగరెట్టు ముట్టించాడు సదాశివం.

సదాశివం సదామాకు కథాశివమే.

క్లబ్బులో సరైన మూడు కుదిరితే అతని ప్రసంగం కథా సరిత్సాగరం అవుతుందని మాకు తెలుసు కదా!

—రెండు రెళ్ళు నాలుగు కావటమే ఫలితం. మళ్ళీ దానికి ఫలితం ఏమిటి? అన్నాడు మూడో మిత్రుడు, చర్చను కొంత తాత్విక ధోరణికి తిప్పుతూ.

సదాశివం గ్లాసు ఖాళీగా ఉండటం గమనించిన పక్కకుర్చీ మిత్రుడు ఆ గ్లాసును విస్కీతో నింపాడు. లేత నారింజ రంగులో ఉన్న ద్రవంకేసి చూస్తూ సన్నగా నవ్వి, గ్లాసు అందుకున్నాడు సదాశివం. తన్మయంగా 'సిప్' చేసిన తర్వాత మళ్ళీ గ్లాసుకేసి చూసుకుంటూ, రెండు రెళ్ళు ఎంతైతే నాకెందుకు? నాకీ విస్కీ కావాలి. అంతే, అన్నాడు.

—శభాష్, అన్నారు మిత్రులు ముక్తకంఠంతో. సదాశివం మూడ్ తెలిసి పోయేసరికి, అసలు కథలోకి రమ్మన్నారు. అతను రానే వచ్చాడు.

—మావాడు మద్రాసులో ఉన్నాడు. వాడు మనకి బాల్య మిత్రుడు. నోట్లో వెండి చెంచాతో పుట్టాడు. సరే ఏదో విధికృతంగా మనకి మిత్రుడయ్యాడనుకోండి అది వేరే విషయం...

పేరా? ఏదైతేనేం? విష్ణు అందాం. విష్ణు చాలా మంచివాడు. తాతతండ్రులు మిగిల్చిపోయిన సిరిసంపదల్ని రెండింతలు,మూడింతలుచేయాలని మద్రాసులో పెద్ద ఎత్తున వ్యాపారం ప్రారంభించాడు.

అతని దీక్షవేరు, దక్షతవేరు. పని విషయంలో విష్ణు మనిషి కాదు, రాక్షసుడు. స్కూల్ దశనుండి పరిచయమైనా, ఆ తర్వాత మేం కలుసుకున్నది చాలా తక్కువ. అయినా కలిసిన ప్రతి సారీ చాలా ఆత్మీయంగా గడపడం అలవాటు. మనక్కాస్త లెక్చెర్లివ్వటం అలా వాటు కదా... అంచేత విష్ణుకి కాస్త ప్రత్యేకమైన గౌరవం మనమీద. గౌరవం మరింత పెరిగిపోయినప్పుడు—ఏమయ్యా మేధావీ, అని పిలుస్తాడు నన్ను.

వస్తున్నా, అసలు కథకే వస్తున్నా...

అనుకోకుండా ఒకరోజు ఉదయం విష్ణు దగ్గర్నుండి కారూ, కబురూ వచ్చాయి. కారులో వెంటనే నన్ను రమ్మని కబురు... పనిమానుకుని ఉన్న ఫళాన వెళ్లా. ఇంట్లోనే అయినా, చాలా బిజీగా ఉన్నాడప్పుడు. కుశల ప్రశ్నలూ వగైరా ఏమీలేకుండా, నీకింకా ఇతర పనులేమన్నా ఉంటే, అన్నీ కాన్సిల్ చేసుకో, ఇదిగో ఫోను, అదిగో కారు. ఎలాగైనా నీ ఇతర ప్రోగ్రాంలు కాన్సిల్ చేసుకుని మధ్యాహ్నందాకా నువ్వు నాతో ఉండిపోవాలి. అన్నాడు విష్ణు.

ఏమిటి హడావుడి. అని అడిగి లాభం లేదు కాబట్టి నేను కాఫీ అడిగి తెప్పించుకుని తాగి, నాకు వేరే ప్రోగ్రాంలేమీ లేవులెమ్మన్నాను.

మరి వెళ్దాం రమ్మన్నాడు విష్ణు వాచీ చూసుకుంటూ.

ఎక్కడికి? అన్నాను వెంటనడుస్తూనే!

ఇంటర్వ్యూకి, అన్నాడు విష్ణు వెంటనే సర్దిచెబుతూ— ఆఫీసుకి, అన్నాడు.

వాట్?, అని ఇంగ్లీషులో తికమకపడ్డాను.

నాకు ఆఫీసుకి చేరేలోపల అసలు విషయం బోధపరిచాడు విష్ణు.

విష్ణూ అండ్ కోలో స్టెనో టైపిస్టు పోస్టు ఖాళీ పడింది. తప్పని సరిగా లేడీ స్టెనోయే కావాలి. అది మావాడి ఇష్టం. స్టెనోగ్రఫీ ఆడవాళ్ల విద్యేనంటాడు విష్ణు. ఇది వరకటి స్టెనోటైపిస్టు మరో చోటికి వెళ్ళిపోయిందట.

నిమిషానికి ఎనభై పదాల స్పీడు ఉన్నా లేకున్నా—పని నీటుగా ఉండాలంటాడు విష్ణు. సరే కొత్త స్టెనోటైపిస్ట్ కోసం పేపర్లలో వెయ్యగా నూటఎనభై ఆరు దరఖాస్తులొచ్చాయి.

విష్ణూ అండ్ కో—లోకిసిబ్బందినిఎంపికచేయటం, ఇప్పుడు కొత్తగా జరుగుతున్న తంతు ఏం కాదు. జనరల్ మేనేజరున్నాడు. పెర్సనల్ మేనేజర్ ఒకాయన కూడా ఉన్నాడు. వాళ్ళమీద విష్ణుకి నమ్మకం లేదా? లేకకాదు.

లేడీస్టెనో టైపిస్టు ఆఫీసులో మావాడు పిలిచినప్పుడల్లా పలకవలసి ఉంటుంది.

బయోడేటాలన్నీ పరిశీలించి నూట ఎనభై మందిలో కేవలం పధ్నాలుగుమందికి 'కాల్ లెటర్స్'పంపారు. పధ్నాలుగుమందీ వచ్చి 'టెస్ట్'కి హాజరై వెళ్ళారు. టెస్ట్ పేపర్లని నిపుణులు పరిశీలించారు. మార్కులువేశారు. ఛార్టులు తయారుచేశారు. మెరిట్ ప్రకారం తయారు చేసిన జాబితానుండి ముగ్గుర్ని ఇంటర్వ్యూకి పిలిచారు. అదీ పూర్వ రంగం. మరి, ఈ ఇంటర్వ్యూకూ నాకు ఏం ప్రమేయం?

—ఇంటర్వ్యూలో జి.ఎం. ఉంటాడు, పి.ఎం. ఉంటాడు. నేనూ ఉంటాను. అయితే నువ్వు కూడా ఉంటే పానల్ నిండుగా ఉంటుంది. అన్నాడు విష్ణు

—నేనేమంత భారీ శాల్తీని కాను కదా? నిండుగా ఉండటమేమిటి? అన్నా.

—ఇదిగో, ఇలా మాట్లాడతావనే, అంటూ చిన్నగా నవ్వాడు విష్ణు.

'బాస్' విష్ణు వస్తుండగా లిఫ్ట్ ఆపరేటర్ శాల్యూట్ చేశాడు. ఆదే అంతస్థులో ఎదురైన ఉద్యోగులందరూ విష్ చేయటమే కాదు, వినయంగా ప్రక్కకి తొలగి నిలబడి దారి ఇచ్చారు.

ఎ.సి. గదిలోకి వెళ్ళి కూచున్నాక —మరికానిద్దామా అంటూ బజార్ నొక్కాడు విష్ణు. క్షణాల్లో జి.ఎం., పి.ఎం. లు వచ్చి కుర్చీల్లో వాలారు. వాళ్ళిద్దరూ కూడా నాకు పరిచితులే. వ్యక్తిగతంగా తెలీదుకాని, పని విషయంలో ఇద్దరూ పందామార్కులేనని విష్ణు తరచు మాకు చెప్తుంటాడు.


ఇంటర్వ్యూలో నేనేం చేయాలో వివరించాడు విష్ణు.

—నీకు కాస్త సైకాలజీ గట్రా తెలుసుకదా? నీ ఇష్టంవచ్చిన ప్రశ్నలుగుప్పించు. మరేంఆలోచించవలసిన అవసరం లేదు. మా వాళ్ళు టెక్నికల్‌గా కొన్ని ప్రశ్నలు వేస్తారు. నీప్రశ్నలు నువ్వు వెయ్యి. అయితే చివర్న—ముగ్గుర్ని గురించి నీ అభిప్రాయం ఏమిటో మాత్రం నాకు చెప్పాలి. ఒ.కె.? అన్నాడు విష్ణు.


విష్ణు నాకే 'టెస్ట్' పెడుతున్నాడన్న మాట. ఒ.కె. అన్నాను.


జి.ఎం, పి.ఎం. లు ఇంతకు మునుపటి 'టెస్ట్'ల కాగితాలు, అభ్యర్థుల బయోడేటాలు ముందేసుకుని కూర్చున్నారు. ఇంటర్వ్యూ మొదలైంది.

నోటికొచ్చిన ప్రశ్నలు వేయవచ్చునని విష్ణునాకు 'లైసెన్స్' ఇచ్చాడు కాని, స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకూడదనిపించింది నాకు. తొలి అభ్యర్థి వచ్చేలోగానే, మెదడుతో కాస్త ఎక్సర్‌సైజు చేయాలని, చిన్న 'వ్యూహం' లాంటిది రూపొందించుకున్నాను.



## ఎమ్మెల్యే ఏడుకొండలు




మొదటి అభ్యర్థి రానే వచ్చింది. జి.ఎం, పి.ఎంలు అందుకున్నారు. టైపింగ్, షార్ట్ హాండ్‌ల మీద ఏవో అడిగారు. పిన్‌కోడ్‌లో ఏదో అంకె దేన్ని సూచిస్తుందన్నారు. జీతం ఎంతకావాలన్నారు. కేబుల్ గ్రాంలో 'మినిమం' ఎన్నిపదాలు? అని అడిగారు. ఆఖర్న నావైపు చూసి ఊరుకున్నారు. జి.ఎం,పి.ఎం ల ప్రశ్నలకు టకటకామని సమాధానాలు చెప్పేసింది ఆ అమ్మాయి. ఇక నేనేం అడుగుతానోనని రెడీగా ఉంది. నేను చాలా నింపాదిగా కూర్చీలో కాస్త వెనక్కి వాలి, రెండు రెళ్ళు ఎంత? అన్నాను.

ఆ అమ్మాయి నావేపు నిశ్చలంగా చూసింది. నేను సన్నగా నవ్వాను.

—ఇరవై రెండు, అందా అమ్మాయి.

—దట్సాల్, అన్నాను.

మా వాడేమీ అడగలేదు. ఆ అమ్మాయిని పంపేశాను. రెండో అమ్మాయి వచ్చీరాగానే కాస్త తడబడింది కాని, కాస్సేపట్లోనే తమాయించుకుని, జి.ఎం, పి.ఎం ల ప్రశ్నలకి చాలా సమయస్ఫూర్తితో జవాబులు చెప్పింది.

నేను ఈ సారేం ప్రశ్న అడుగుతానో అని జి.ఏం, పి.ఎంలు నావైపు ఆసక్తిగా చూశారు.

—రెండు రెళ్ళు ఎంతో చెప్పగలరా?, అన్నాను నేను చాలా ఈజీగా.

ఈ అమ్మాయి రెండు మూడు క్షణాలపాటు ఆలోచించింది కూడా. నావైపు కళ్ళార్పుతూ చూసి, చిన్నగా నవ్వింది.

—రెండు రెళ్ళు నాలుగు, లేక ఇరవై రెండు, అంది.

—థాంక్స్, అన్నాను.

ఆ అమ్మాయి వెళ్ళిపోగానే విష్ణు నావైపు చూసి కళ్ళెగరేసి, మేధావివనిపించావు...మూడు మూళ్ళెంత? అని ఎందుకు అడగవు? అన్నాడు.

చివరి అభ్యర్థి, మూడో అమ్మాయి రానే వచ్చింది. ఏవో సినిమాలగురించి అడిగాడు జి.ఎం.ఎక్కువజీతం ఇస్తే వేరే ఉద్యోగాలకి వెళ్ళిపోతావా? అన్నాడు పి.ఎం. ఇక చివరి ప్రశ్న నాదే కదా?

—సింపుల్ క్వెశ్చన్. రెండు రెళ్ళెంత? అన్నాను.

—సింపుల్ ఆన్సర్‌సర్, ఆల్వేస్ ఫోర్. రెండు రెళ్ళు— ఎప్పుడూ నాలుగే, అంది ఆమ్మాయి చాలా నిశ్చయంగా.

ఇంటర్వ్యూలు ముగిసాయి. కాస్సేపట్లోనే రిజల్ట్ ప్రకటించాలన్న మాట.

కాఫీలు తెప్పించాడు విష్ణు.

జి.ఎం., పి.ఎం కాస్సేపు చర్చల్లో పడ్డారు. ఆ తర్వాత తమ అభిప్రాయాన్ని వివరించారు. తమాషా ఏమిటంటే, ఇద్దరికీ ఏకాభిప్రాయం కలిగింది. మరీ తమాషా ఏంటంటే, ఆ ముగ్గురిలో ఎవరైనా సరే విష్ణూ అండ్ కో లో స్టెనో టైపిస్ట్ ఉద్యోగానికి చక్కగా సరిపోతారని జి.ఎం., పి.ఎం లు అభిప్రాయ పడ్డారు.

నావైపు సాభిప్రాయంగా చూశాడు జి.ఎం. ఆ తర్వాత విష్ణుతో—

రెండు రెళ్ళు ప్రశ్న ఎందుకో తెలీదుగాని, ముగ్గురు కాండిడేట్లూ 'ఇంటర్వ్యూ' చక్కగా చేశారని మా అభిప్రాయం, అన్నారు 'మా'ను కాస్త ఒత్తి పలుకుతూ.

—ముగ్గురూ ముగ్గురే, బెస్ట్— అన్నాడు పి.ఎం.

—మనక్కావలసింది వొక్కరే కదా? అంటూ, నావైపు చూసి, సో? అన్నాడు విష్ణు.

నాలోని మేధావికి గిలిగింతలు పెట్టినట్లయింది. పాలను నీటినీ వేరు చేసే హంసల్ని గురించి విన్నామే గాని, చూశామా రెండు రెళ్ళు ఎంత అనే ప్రశ్న సామాన్యమైంది కాదు.

కాస్త గొంతు సరిచేసుకుని, మరికాస్త మేధావి పోజు పెట్టి, నా ఇంప్రెషన్ చెప్తాను, అంటూ చెప్పాను.

రెండు రెళ్ళెంత? అనే సింపుల్ ప్రశ్నకు సింపుల్‌గా నాలుగని చెప్పిన అమ్మాయి, ముక్కు సూటిగా పోయే రకం. ప్రతి పనీ వాస్తవికంగా ఆలోచించి చేస్తుందన్న మాట. ఇక రెండు రెళ్ళు ఇరవై రెండన్న అమ్మాయికి ఆలోచనా శక్తితో పాటు మాంచి ఊహా శక్తి ఉందన్న మాట. రెండు రెళ్ళు నాలుగని నాకు తెలుసని వేరే చెప్పక్కర్లేదు కదా! అయినా ఆ ప్రశ్న అడిగానంటే అర్థమేమిటి? ఏదో వింత సమాధానం ఆశిస్తున్నానని ఆ అమ్మాయి అనుమానించిందన్న మాట. నేను అతి తెలివిగా ప్రశ్న వేసే అవకాశం ఉందని, ఆ అమ్మాయి కాస్త అతి తెలివిగానే ఇరవైరెండని జవాబిచ్చింది. ఇకపోతే, ఆ ప్రశ్నకు రెండు సమాధానాలిచ్చిన అమ్మాయి— అవసరమైతే చాలా వాస్తవికంగానూ, అంతకన్నా అవసరమైతే ఇంకాస్త ఊహాత్మకంగానూ ఆలోచించగలదన్నమాట. ప్రశ్న ఒకటే అయినా వేర్వేరు జవాబులు వచ్చాయి. వీటిలో సరైన జవాబు ఏదన్నది కాదు ప్రశ్న. మనకి ఎటువంటి మనిషి కావాలనేది అసలు పాయింటు, సో, అన్నాను.

యస్, అన్నాడు విష్ణు కళ్ళుమూసుకుని, పెన్సిల్‌తో నుదిటి మీద సుతిమెత్తగా రాస్తూ.. మరుసటి నిమిషం లోనే విష్ణు తన నిర్ణయం ప్రకటించేశాడు.

— సదాశివం మరో సిగరెట్టు వెలిగించి, విష్ణు ఎవర్ని ఎంపిక చేశాడో తెలుసా? అన్నాడు.

కథలోంచి కోలుకుంటూనే మేం మెదళ్ళకి కాస్త పదును పెట్టాం. రెండు రెళ్ళు నాలుగనగా, కాదు— ఇరవై రెండనటమే సరైన జవాబని మరొకరు— అదేం కాదు, రెండు జవాబులు చెప్పటమే రైటని ఇంకొకరు.

సదాశివం మా అందరి కేసి కలయ జూశాక, నాటకీయంగా నవ్వి—

ఇంటర్వ్యూలో విష్ణు ప్రశ్నలేమీ అడగలేదు. ముగ్గురమ్మాయిల్ని ప్రశ్నించాంగాని, మా ధోరణి వేరు. మా అమూల్యాభిప్రాయాలన్నీ విన్నాకే, 'బాస్' విష్ణు జి.ఎం, పి.ఎం. లకేసి మార్చి మార్చి చూసి, ఆ ఆరెంజి కలర్ చీరమ్మాయికి అపాయింట్‌మెంటు ఆర్డర్ పంపించండి. అని ఆర్డరు చేశాడు. ఆరెంజికలర్ చీరమ్మాయి ఎవరో నాకు గుర్తులేదు. రెండు రెళ్ళ ప్రశ్నకి ఆ అమ్మాయి సమాధానమేమిటో విడమర్చి గుర్తుచేసు కోలేక పోయాను. ఆ అమ్మాయి సెలెక్ట్ అయింది. రెండు రెళ్ళ ప్రశ్నమీద కాదని స్పష్టమయింది.

సదాశివం గ్లాసులో ఆ నారింజ రంగు విస్కీలో లేత వెన్నెల లీలగా మెరిసింది.

మిత్రులందరం ఆ గ్లాసులో రంగువైపు కళ్ళార్పకుండా చూశాం.

—రెండురెళ్ళు ఎంతైతే విష్ణుకేం? నాకేం? అంటూ సిప్ చేశాడు సదాశివం.

*